తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com

# అక్షరగళం
నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | సోమవారం | 09-02-2026 | సంపుటి-03 | సంచిక-244 | పేజీలు - 08 | వెల:3/–



## మరోసారి దేశవ్యాప్తంగా రైతు సంఘాల నిరసనలు..

భారత్‌అమెరికా ట్రేడ్ డీల్‌పై తీవ్ర వ్యతిరేకత
ఈనెల 12న దేశవ్యాప్తంగా నిరసనలు

**అక్షరగళం, న్యూఢిల్లీ:** దేశంలో మరోసారి అన్నదాతలు ఆందోళనలకు పిలుపునిచ్చారు. భారత్, అమెరికా మధ్య తాజాగా కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కదం తొక్కేందుకు సిద్ధమయ్యారు. ఈ ట్రేడ్ డీల్‌తో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్న రైతు సంఘాలు.. ఈనెల 12న దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిరసనలకు సంయుక్త కిసాన్ మోర్చా

మిగతా 2లో



## 'మంత్రి పదవి ఇచ్చారు.. ఎమ్మెల్సీ పదవి మాత్రం లేదు'

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు విమర్శ

**అక్షరగళం, హైదరాబాద్ :**
సుమారు మూడు నెలల క్రితం, అంటే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మహ్మద్ అజారుద్దీన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మంత్రి పదవిపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు విమర్శల వర్షం కురిపించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం బాగానే ఉన్నా, ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. 'అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చి 3 నెలలైంది. ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. ఇంకో మూడు నెలల్లో

మిగతా 2లో

## సింగరేణి కార్మికుల వల్లే అధికారంలో ప్రజా ప్రభుత్వం

**భూపాలపల్లి జిల్లాలో పుర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి**

సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ తీసుకోం: సీఎం రేవంత్ రెడ్డి
కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా?
జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
'బీజేపీ, బీఆర్ఎస్ రెండూ బొమ్మబొరుసులే'



**అక్షరగళం, హైదరాబాద్, భూపాలపల్లి:**
సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని, మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ చేరుకున్న సీఎం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బాలాలయంలో

మిగతా 2లో

## 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ

**అక్షరగళం, ఛత్తీస్‌గఢ్:**
ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోంది. ఈ డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌లను దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయి" అని అమిత్ షా తెలిపారు.



మిగతా 2లో

## రేవంత్‌ను కేసు నుంచి తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారు

భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**అక్షరగళం, హనుమకొండ:**
హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో అగ్నిప్రమాదం కావాలనే చేశారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్రప్రజలకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని, అసలు నేరస్థులు ఎవరో తేలాలంటే రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "ఓటుకు



మిగతా 2లో


## రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ కీలక వ్యాఖ్యలు

**ముంబయి:**
తన రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినైనా పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు. "ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు తెలియజేశాను. కానీ..



మిగతా 2లో

## యూఎస్ నుంచి 500 బి.డాలర్ల దిగుమతులు..



వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్

**అక్షరగళం, న్యూఢిల్లీ:**
అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఆ దేశం నుంచి వచ్చే ఐదేళ్లలో భారత్ 500 బిలియన్ డాలర్ల (రూ.45 లక్షల కోట్లకుపైగా) విలువైన వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ విషయంలో భారత్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. వృద్ధి చెందుతున్న మన దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండు ట్రిలియన్ డాలర్ల డిమాండ్‌ను

మిగతా 2లో

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కేసీఆర్ నిధులివ్వలేదు

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**అక్షరగళం, వైరా:**
బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, కాలనీలు నిర్మించిందని చెప్పారు. ఇప్పుడు కూడా అదే తరహాలో ఇస్తున్నామన్నారు. "మన నిధులు మనకే ఖర్చు చేయాలని పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం నిధులను పేదల కోసం ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కేసీఆర్ నిధులు ఇవ్వలేదు. సాగుకు ఉచిత విద్యుత్‌ను మొదటిసారి అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి" అని భట్టి విక్రమార్క కోరారు.





## శత్రు ఉపగ్రహాలపై నిఘా..! భారత్ కీలక పురోగతి

**అక్షరగళం, న్యూఢిల్లీ:**
భారత అంతరిక్ష పరిశోధనల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఇటీవల పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక మైలురాయి సాధించింది. తమ ఉపగ్రహం నుంచి కక్ష్యలోని వస్తువులను చిత్రీకరించే స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉపగ్రహాలపై నిఘా ఉంచే సామర్థ్యాన్ని భారత్ ప్రైవేటు రంగం సొంతం చేసుకున్నట్లయ్యింది. 80 కిలోల భూ పరిశీలన ఉపగ్రహం ఏఎఫ్ఆర్ ను ఫాల్కన్ 9 ద్వారా అజిస్టా రెండున్నరేళ్ల క్రితం కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం విజయవంతంగా పనిచేస్తోన్న ఈ శాటిలైట్ మరో రెండున్నరేళ్లు సేవలు అందించగలదు. ఈ క్రమంలో పరిశోధనల్లో భాగంగా ఏఎఫ్ఆర్ సాయంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని అజిస్టా విజయవంతంగా చిత్రీకరించింది. వీటికి సంబంధించి ఫిబ్రవరి 3న రెండు ప్రయోగాలను వేర్వేరు వాతావరణ సందర్భాల్లో చేసింది. తొలి ప్రయోగాన్ని 300 కి.మీ దూరం నుంచి, రెండో ప్రయోగాన్ని 245 కి.మీ దూరం నుంచి చేసినట్లు వెల్లడించింది. ఈ రెండు

మిగతా 2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్.. రెండు పార్టీలు ఒక్కటే



భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**అక్షరగళం, నల్గొండ:**
రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా.. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే.. మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా.. గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు

మిగతా 2లో

# సింగరేణి కార్మికుల వల్లే అధికారంలో ప్రజా ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాత)

ప్రత్యేక పూజలు చేశారు. రూ.12.15 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనుల్లో భాగంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ''ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశాం. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన మాకు లేదు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తాం. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు.. కొనసాగుతుంది.



**కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా?**

200414 మధ్య 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చాం. గత పదేళ్లలో ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిందా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్‌ఎస్‌కు.. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పా. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత ఇస్తాం. దక్షిణ కుంభమేళాగా సమ్మక్క.. సారలమ్మ జాతర నిర్వహించుకొన్నాం. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తాం. బీఆర్‌ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులను బెదిరించి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో రూ.1500 కోట్లు తీసుకున్నారు. బీఆర్‌ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి. పాపాల ఊబిలో ఆ పార్టీ కూరుకుపోతుంది. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. 'నేను ముఖ్యమంత్రినా కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి' అని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములాఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా?'' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన**

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఉన్న జిల్లాలను తొలగించేది లేదు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదు. జిల్లాల పునర్వ్యవస్థికరణ కోసం అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఆ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు' అని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. గత జనవరిలో సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) డైరీ ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను పునర్వ్యవస్థీకరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత పాటించకుండా ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాలతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం రాజకీయ విభజన కోణంలో ఏర్పాటు చేసిన జిల్లాలను ప్రజల అభీష్టం మేరకు హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**అప్పట్లో అడ్డగోలుగా విభజన**

'గత ప్రభుత్వం రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలను ఇష్టానుసారంగా విభజించింది. ఒక జిల్లాలో ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఉంటే, మరో జిల్లాలో 14 ఉన్నాయి. ఇక మండలాలు, రెవెన్యూ డివిజన్ల విభజన అడ్డగోలుగా జరిగింది. జిల్లాల సంఖ్య తగ్గించడం, పెంచడం అని కాదు కానీ రేషనలైజేషన్ చేయాల్సిన అవసరం ఉంది. ఏ విధంగా చేయాలి.. ఒక మండలంలో ఎంత జనాభా ఉండాలి, ఒక డివిజన్‌లో ఎంత ఉండాలి, ఒక జిల్లాలో ఎంత ఉండాలనేది నిర్ణయించాలి. ప్రస్తుతం ఒక జిల్లాలో 3 లక్షల జనాభా ఉంటే ఒక జిల్లాలో కోటి జనాభా ఉంది. ఇలాంటప్పుడు పరిపాలన ఏవిధంగా చేస్తారు? ఇలాంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ఒక లీడర్ తనకు నచ్చిన 3, 4 గ్రామాలతో ఒక మండలాన్ని ఏర్పాటు చేసుకుంటే... మరొకాయన 2, 3 ఎంపీటీసీలతో ఒక మండలాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. నేను ఎంపీగా ఉన్నప్పుడు మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశానికి వెళ్లా. వేదికపై చైర్మన్, వైస్ చైర్మన్ ఇద్దరు మాత్రమే కూర్చున్నారు. మరొకాయన రాలేదు. నాకు ఎవర్ని చూసి మాట్లాడాలో అర్థం కాలేదు. జిల్లా ఈ విధంగా ఉంటే ఎలా? ఇలాంటి తప్పిదాల వల్ల పాలనపై నమ్మకం పోతుంది. దీన్ని సరి చేయాలి..' అని సీఎం అన్నారు.

**తొలుత మండలాల హేతుబద్ధీకరణ**

'ముందుగా మండలాలను హేతుబద్ధీకరించాలి. మండలంలో 10 శాతం ఎక్కువ జనాభా లేదా తక్కువ.. రెవెన్యూ డివిజన్, జిల్లాల్లో కూడా ఇదే ఫార్ములాతో విభజన జరగాలి. దీనిపై అసెంబ్లీలో డిబేట్ పెడతాం. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం. మార్గదర్శకాలు రూపొందిస్తాం. కూలంకషంగా చర్చించిన తర్వాతే విధివిధానాలు ఖరారు చేసి నిర్ణయం తీసుకుంటాం. శాస్త్రీయ పద్ధతిలో వీటిని హేతుబద్ధీకరించాలనేది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకోసం ప్రత్యేకంగా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఆధ్వర్యంలో కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇందులో రెవెన్యూ అధికారులతో పాటు సంబంధిత అధికారులంతా సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆర్నెల్లు పర్యటించి ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఒక నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటాం. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి విధివిధానాలు ఖరారు చేస్తాం' అని రేవంత్ తెలిపారు.

**'బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ బొమ్మ-బొరుసులే'**

ఫోన్ల ట్యాపింగ్‌తో బ్లాక్ మెయిల్ చేసి వేల కోట్లు సంపాదించారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ల ట్యాపింగ్ కేసుల నుంచి తప్పించుకోవడానికి బీఆర్‌ఎస్‌కు బీజేపీకి సహకరిస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ బొమ్మబొరుసు లాంటి పార్టీలని మండిపడ్డారు. ఇక భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారనే వార్తలపై సీఎం రేవంత్ స్పందించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చిన్న గ్రామం నుంచి జిల్లా కేంద్రంగా భూపాలపల్లి మారింది. కాంగ్రెస్ అభివృద్ధితోనే భూపాలపల్లి ఈ స్థాయికి చేరింది. భూపాలపల్లి ఎక్కడికి పోదు.. తప్పుడు ప్రచారం నమ్మొద్దు. మరొకవైపు మెడికల్ బోర్డు రద్దు అవుతుందనే విషం ప్రచారం కూడా మొదలుపెట్టారు. మెడికల్ బోర్డు రద్దు ఆలోచన ప్రభుత్వ దృష్టిలో లేదు. తప్పుడు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు' అని సీఎం రేవంత్ హెచ్చరించారు.




## మరోసారి దేశవ్యాప్తంగా రైతు సంఘాల నిరసనలు..

(మొదటిపేజీ తరువాత)

కూడా మద్దతు తెలిపింది. సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ.. దేశవ్యాప్తంగా అన్నదాతలు దాదాపు 2 ఏళ్ల పాటు దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో చేసిన ఆందోళనలు దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. రైతుల సుదీర్ఘ నిరసనలతో దిగివచ్చిన కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దిగివచ్చి.. ఆ 3 వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవడంతో.. రైతులు శాంతించారు. అయితే ఇప్పుడు మరో సమరానికి దేశంలోని రైతులు రెడీ అయ్యారు. భారత్‌అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. దేశంలోని పలు రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా.. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)తో పాటు మరికొన్ని రైతు సంఘాలు ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఈ క్రమంలోనే సంయుక్త కిసాన్ మోర్చా.. దాని అనుబంధ విభాగమైన ఆల్ ఇండియా కిసాన్ సభ సంయుక్తంగా ఒక ప్రకటనను విడుదల చేశాయి. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు ఆ ప్రకటనలో వెల్లడించాయి. ఈ ఒప్పందానికి భారత్ అంగీకరించడం అంటే.. మన దేశ వ్యవసాయ రంగంతోపాటు.. మన రైతులను అమెరికా మల్టీ నేషనల్ కంపెనీలకు పూర్తిగా లొంగిపోవడమేనని సంయుక్త కిసాన్ మోర్చా సంచలన ఆరోపణలు చేసింది. వాణిజ్య చర్చల విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ.. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నుంచి మినహాయించామని.. ఈ ఒప్పందంతో రైతు ప్రయోజనాలపై రాజీపడబోమని పీయూష్ గోయల్ చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలు అంటూ ఎస్‌కేఎం తీవ్రంగా మండిపడింది. ఒకవైపు భారత వ్యవసాయ రంగం సురక్షితమని కేంద్రమంత్రి ట్వీట్ చేస్తుంటే.. మరోవైపు భారత్‌అమెరికా సంయుక్త ప్రకటనలో మాత్రం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న నాన్ టారిఫ్ బారియర్స్ తొలగించేందుకు భారత్ అంగీకరించిందని ఉందని.. రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ ధల్లేవాల్ ఆరోపించారు. అమెరికా తీసుకువస్తున్న ఒత్తిడికి తలొగ్గిన మోదీ సర్కార్.. అమెరికా ఉత్పత్తులను భారత మార్కెట్లలోకి దిగుమతి చేసుకుంటే భారత రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ ఒప్పందం వల్ల చాలా ఉత్పత్తులపై ప్రభావం పడుతుందని.. ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) నేత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. పశువుల మేత, పాడి పరిశ్రమ, పండ్ల తోటలపై ప్రభావం పడి.. భారత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ వస్తువులపై అమెరికా విధించే సుంకాలు 18 శాతానికి పెరిగాయని సంయుక్త కిసాన్ మోర్చా ఆరోపించింది. అదే సమయంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 30 శాతం నుంచి 150 శాతం వరకు విధిస్తున్న టారిఫ్‌లను సున్నా శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారని.. ఇలా చేయడం వల్ల అమెరికా నుంచి వచ్చే చౌకైన మొక్కజొన్న, గోధుమలు, సోయాబీన్ ఆయిల్, ఇథనాల్, జన్యుమార్పిడి విత్తనాలు భారత మార్కెట్‌ను నిలువునా ముంచుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామాల వారీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈ నిరసనల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టి బొమ్మలను దహనం చేయాలని పేర్కొన్నాయి. ఈ నిరసనల్లో రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, సామాన్య ప్రజలు పాల్గొని.. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని అడ్డుకునేలా ఒత్తిడి తీసుకురావాలని రైతు సంఘం నేతలు రాకేష్‌టికాయత్, దర్శన్ పాల్ వంటి వారు పిలుపునిచ్చారు.

## యూఎస్ నుంచి 500 బి.డాలర్ల దిగుమతులు..



(మొదటిపేజీ తరువాత)

సృష్టిస్తుందనే విషయాన్ని లెక్కలోకి తీసుకుంటే.. ఇది చాలా తక్కువేనని చెప్పారు. ''భారత్ ప్రస్తుతం ఆయా దేశాల నుంచి ఏటా దిగుమతి చేసుకుంటున్న 300 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను.. అమెరికా నుంచి కొనుగోలు చేయొచ్చు. అదేవిధంగా మన దేశ మొత్తం దిగుమతుల డిమాండ్ రాబోయే ఐదేళ్లలో రెండు ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని అమెరికన్ అధికారులకూ తెలిపాం. మార్కెట్ విషయంలో పోటీతత్వాన్ని కలిగి ఉండాలని సూచించాం'' అని పీయూష్ గోయల్ 'పీటీఐ' వార్తాసంస్థ ఇంటర్వ్యూలో తెలిపారు. అగ్రరాజ్యం (USA) నుంచి మన దేశం ఇప్పటికే ఏటా 4550 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందన్నారు. ''ప్రముఖ టెక్ సంస్థలు భారత్‌లో భారీ పెట్టుబడులను ప్రకటించాయి. దేశంలో 10 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. వాటి కోసం పరికరాలు అవసరమవుతాయి. ఈ డిమాండ్‌ను అమెరికా తీర్చొచ్చు. విమాన పరిశ్రమకు సంబంధించిన అవసరాలు ఉన్నాయి. విమానాల విషయంలో ఒక్క బోయింగ్‌కే మన దేశం నుంచి 50 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.డేటా సెంటర్లు, ఏఐ మిషన్, తయారీ రంగం, ఖనిజాల ప్రాసెసింగ్ వంటి కార్యకలాపాలకు అధిక నాణ్యత కలిగిన యంత్రాలు, ఐసీటీ ఉత్పత్తులు, ఎన్విడియా చిప్‌లు, క్వాంటం కంప్యూటింగ్ కోసం ఏఐ యంత్రాలు, ఉక్కు పరిశ్రమల కోసం కోకింగ్ బొగ్గు అవసరం. ఇవన్నీ అమెరికా సమకూర్చగలదు. కాబట్టి.. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనుకుంటున్న భారత్‌కు ఆ దేశం నుంచి ఏటా 100 బిలియన్ డాలర్ల దిగుమతులు చాలా తక్కువ అంచనా'' అని గోయల్ అన్నారు.

## 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ

(మొదటిపేజీ తరువాత)




నిర్దేశించుకున్న గడువులోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలు సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికి పైగా లొంగిపోయారు.



## శత్రు ఉపగ్రహాలపై నిఘా..! భారత్ కీలక పురోగతి

(మొదటిపేజీ తరువాత)

సందర్భాల్లోనూ వేగంగా తిరుగుతున్న ఐఎస్‌ఎస్‌ను ఏఎఫ్‌ఆర్ సెన్సర్లు స్పష్టంగా చిత్రీకరించాయని.. ట్రాకింగ్ అల్గరిథమ్‌లు, ఎలక్ట్రోఆప్టికల్ ఇమేజింగ్ వందశాతం కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ రెండు సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేశామని, కక్ష్యలోని వస్తువులను ట్రాక్ చేసేందుకు ఇవి ఉపయోగించవచ్చని అజిస్టా వెల్లడించింది. కమ్యూనికేషన్, నావిగేషన్, భూమి పరిశీలన, వ్యూహాత్మక అవసరాల కోసం ప్రస్తుతం భారత్ దాదాపు 50 శాటిలైట్లను ఆపరేట్ చేస్తోంది. వీటికి రక్షణ కల్పించేందుకు కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు ఏం చేస్తున్నాయనే విషయం తెలుసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నిఘా సామర్థ్యాలపై ఇస్రో ఇప్పటికే దృష్టి పెట్టగా.. వీటికి అజిస్టా వంటి ప్రైవేటు రంగ సంస్థల పరిశోధనలు మరింత దోహదం చేస్తాయని అంటున్నారు.

## కాంగ్రెస్, బీఆర్‌ఎస్.. రెండు పార్టీలు ఒక్కటే

(మొదటిపేజీ తరువాత)



కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు. నల్గొండలో ఇప్పటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. భాజపాను గెలిపిస్తే నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు అవకాశాలు ఇచ్చారు.. ఒక్కసారి భాజపాకు అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భాజపాకు అవకాశం ఇస్తే తెలంగాణను అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

## రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాత)



యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా.. సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు'' అని భాగవత్ చెప్పారు. చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకుల నుంచి సంఘ్ పని చేయించుకుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్ అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని తెలిపారు.




## 'మంత్రి పదవి ఇచ్చారు.. ఎమ్మెల్సీ పదవి మాత్రం లేదు'

(మొదటిపేజీ తరువాత)

ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవి పోతుంది. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మేం ప్రశ్నినందుకే.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కింది' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు హరీష్‌రావు. అజారుద్దీన్ తెలంగాణ ప్రభుత్వంలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ పదవిని ఆయన 31 అక్టోబర్ 2025న స్వీకరించారు. అదేవిధంగా, ఆయన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు . అయితే ఎమ్మెల్సీగా లేరు. అంటే, ప్రస్తుతం ఆయనకు ఉన్న పదవి రాష్ట్ర మంత్రిగా ఉన్నారు కానీ ఎమ్మెల్సీగా లేరు. రాష్ట్ర మంత్రిగా ఉండాలంటే అటు ఎమ్మెల్యేగా కానీ, ఎమ్మెల్సీ కానీ ఉండాలి. ఇదే విషయాన్ని ప్రశ్నించారు హరీష్‌రావు.


## రేవంత్‌ను కేసు నుంచి తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారు

(మొదటిపేజీ తరువాత)



నోటు కేసు నుంచి రేవంత్‌ను తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారు. అందరూ మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉంటే రేవంత్‌రెడ్డి మాత్రం మురికి పనుల మీద ఉన్నారు. కేసు చివరి దశలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం జరగడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు జరిగి ఏడాదిన్నర అయినా.. కనీసం కేసు కూడా నమోదు కాలేదు. సింగరేణి కుంభకోణం బయటపెట్టినా.. కేంద్రం స్పందించటంలేదు'' అని కేటీఆర్ ఆరోపించారు.

# విపక్షంగా కాంగ్రెస్ వైఫల్యం




దేశంలో రాజకీయ నేతలు బానిస భాజాలంతో బతుకుతున్నారు. అధికారపక్షంపై బట్టకాల్చి మీద పడేస్తే.. తరవాత అధకారం మనదే అన్న ధోరణిలో ఉన్నారు. ఎవరి లక్ష్యమైనా అధికారమే. అధికారంలో ఉన్నవారు దానిని కాపాడుకునే ప్రయత్నం..లేనివారు అధికారంలోకి వచ్చే ప్రయత్నాల్లో విన్యాసాలు చేస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఎవరి పేరుందో వెతికి మరీ విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇందులో ముందున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతన్న వేళ సమస్యలపై పోరాటం ఆపేశారు. ప్రజల పక్షాలన పోరాడలేక చతికిల పడ్డారు. పార్లమెంట్‌కు రావడం గోల చేయడం, వాకౌట్ చేయడం ఇదీ విపక్షాలు అలవాటు చేసున్న నమూనా. అధికార బిజెపి ఏదయితే కోరుకుంటుందో అదే చేస్తున్నారు. మనదేశంలో జరిగిన దారుణ ఘటనలకు సంబంధించి కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌పై చర్చ అసవరం లేదు. దేశంలో జరుగుతున్న సమస్యలపై చర్చ పట్టదు. ఉపాధిపతకానికి గాంధీ పేరు తొలగించారని ఆందోళన చేస్తారు. ఇది ప్రజలకు కూడాగుడ్డా పెట్టేది కాదు. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో రాహుల్ ఓ అసమర్థ నేత అని ఉంది. అది నిజమే అన్నట్లుగా గత పదేళ్లుగా రాహుల్ ప్రజల సమస్యలపై ఒక్కటంటే ఒక్క పోరాటం చేయలేదు. పార్లమెంట్‌లో పోరాడడం లేదు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఏమైంది అన్న ఆందోళన కలుగుతోంది. నాయకత్వ సమస్య ఈ పార్టీని పట్టిపీడిస్తున్నది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణం కేవలం రాహుల్ అన్నదే గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ పాదయాత్ర చేసి ఇప్పుడేమో అచేతనంగా ఉండిపోయారు. పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నవతరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పెద్దగా కార్యాచరణ చూపడం లేదు. మోడీ వైపల్యాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. పార్లమెంటులో వివిధ అంశాలను లేవనెత్తి వాటిపై చర్చించే అవకాశం ఉంటుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం కావచ్చు, బడ్జెట్ ప్రసంగం కావచ్చు...

వీటిపై చర్చలో ప్రభుత్వ విధానాలను ఏకిపారేయవచ్చు. కానీ దానిని ఉపయోగించు కోవడంలో విపక్షనేతగా రాహుల్ పూర్తిగా విఫలం అయ్యారనే చెప్పాలి. సంబంధం లేని మాజీ ఆర్మీ చీఫ్ నరవాణెలి రాతలను ప్రస్తావిచడం ద్వారా అభాసుపాలయ్యారు. ఎందుకంటే ఆ పుస్తకం ఇంకా అచ్చు కాలేదు. ఇలా వరుస వైఫల్యాలను చూసిన తరవాత కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్నది పట్టించుకోవడం లేదు. వారి ఆలోచన ల్లో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టలేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు అంతర్థానం అయ్యాయి. వారు ఇప్పటికీ అది గమనించడం లేదు. అమెరికాతో ఒప్పందాన్ని కూడా వ్యతిరేకించడమంటే అంతకు మించిన దౌర్భాగ్యం మరోటి లేదు. ప్రపంచంలో మనదేశం మనుగడ సాగించాలంటే ఒప్పందాలు తప్పవు. ట్రంప్ బెదరింపుల కారణంగా ఇంతకాలం మోడీ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇప్పుడు ఒప్పందానికి ఓకే చెప్పిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు విమర్శలు చేస్తున్నారు. ఇదే వారి నాయకత్వ లోపానికి, అంతర్జాతీయ అవగాహన లేదనడానికి నిదర్శనంగా చూడాలి. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి.

ఫలితంగా మనవాళ్లు ఏదేశమైన వెళ్లి పనిచేసుకోగలుగుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా సాగాలి. అవి మన ప్రజలకు ఎలా ఉపయోగమో ఆలోచన చేయాలి. అలా చేయకపోవడం వల్లనే కాంగ్రెస్, కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఆలోచనా పరులు లోపించారు. ఒకరిద్దరు రాహుల్‌ను కంట్రోల్ చేస్తున్నారు. అందుకే ఆయన ఆలోచనలు ఎంతసేపు మోడీని దింపడమెలా అన్న ధోరణిలో సాగుతున్నారు. మోడీని దింపేముందు మోడీ పనులను నిలదీఏ ప్రయత్నాలు చేయడం లేదు. మోడీని దోషజగా నిలబెట్టే యత్నాలు చేయడం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. పివి నరసింహారావు సంస్కరణ పుణ్యమా అని ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి చర్యలు కాలానుగుణంగా ఉండడం లేదు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు అనుసరించిన విధానాలను రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం వల్ల దౌర్భాగ్యంగా చూడాలి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహరచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటన్నది ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన నాయకత్వ పటిమను బలపర్చుకోకుంటే రాణించడం కలష్టమన్న విషయం రాహుల్ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

# 'పర్యావరణ నిర్లక్ష్యం జాతి మనుగడకు అత్యంత ప్రమాదకరం'

పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరంగా పరిణమిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత వ్యవసాయ పద్ధతులను పరిరక్షించుకోవడం వల్ల భూసారం, మనుషుల ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రజలు చైతన్యం పెంచుకోవాలని కోరారు.పశు సంపదను పెంచు కోలేకపోతే వచ్చే 5 ఏళ్లలో మన భూమి, మన వ్యవసాయం మనకు కాకుండా పోతాయని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా kadtal మండలం అన్మాసుపల్లి లోని ఎర్త్ సెంటర్ లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మాజీ అధ్యక్షుడు అచలేందర్ రెడ్డి తదితర ముఖ్యులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాల గ్రేడింగ్ తో ప్రకృతి వ్యవసాయం లో కూడా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాలు దేశ సంపద అని, వాటి విస్తృత




వినియోగానికి ప్రోత్సాహం ఇచ్చే రీతిలో ప్రణాళికాబద్ధమైన ప్రభుత్వ విధానాలు అవసరం అన్నారు. రైతు ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విధానాలు రూపొందాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తేనే ప్రకృతి వ్యవసాయ పద్ధతు ల వినియోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలలో మార్పు వచ్చినప్పుడే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఏపీ మాస్ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి అన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ ఉద్యమం లో కీలక పాత్ర ఉందన్నారు. దేశీ విత్తనాల తో పంట దిగుబడి తగ్గుతుందనేది కేవలం ఒక అపోహనని , వాటి వినియోగం వల్ల భూమి, మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ విత్తన వ్యవస్థ ను బలోపేతం చేయాలన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో హైబ్రిడ్, దేశీ విత్తన వ్యవస్థల మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ప్రయోజనాలతో కూడిన విత్తన వ్యవస్థను రైతులు సవాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ భాగస్వామ్యం తో విత్తన పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. లక్ష్యం దిశగా ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని, మరింత స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతామని ఆమె చెప్పారు

# మణిపూర్ చక్కబడేనా!

రెండున్నరేళ్లపాటు కనీవినీ ఎరుగని హింసతో అట్టుడికి, నిరుడు ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలనలో కొచ్చిన మణిపుర్‌లో ఎట్టకేలకు బుధవారం ముమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కుకీ, నాగా తెగలకు చెందిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర రాజకీయాలను శాసించే మెయితీ తెగకు చెందినవారే అయినా ఖేమ్‌చంద్‌కు మధ్యేవాదిగా ముద్ర ఉంది. మణిపుర్ సమాజంలో తీవ్రస్థాయి విద్వేషాలు ప్రబలిన వర్తమానంలో ఆగ్రహావేశాలు అంత త్వరగా సమసిపోవు.

అందుకే కుకీ-జో తెగలకు చెందిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఎవరూ 'మెయితీ ప్రభుత్వం'లో చేరొద్దంటూ ఆ తెగలకు చెందిన సంస్థలు హెచ్చరించాయి. దాన్ని బేఖాతరు చేసి, ఢిల్లీలోని మణిపుర్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ వేదికగా ప్రమాణం చేసిన మహిళా ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్‌పై నిప్పులు చెరిగారు. రాజధాని ఇంఫాల్‌లో ఆమె ప్రమాణం చేయలేకపోవటానికి రెండు కారణాలున్నాయి. మెయితీల ఆధిక్యత గల ఇంఫాల్ మణిపుర్ లోయలో ఉంది. వారినుంచి సమస్య ఎదురయ్యే అవకాశం ఉండటంతోపాటు, కుకీలు కూడా దాడిచేసే ప్రమాదం ఉంటుంది. సమస్య ఎంత జటిలంగా మారిందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ వ్యవహార శైలి మెరుగ్గావుంటే, ఇలాంటి సమస్యలు త్వరలోనే సర్దుకుంటాయి. అయితే సమాజంలో సామరస్యతకు ముందు సొంతింటిని చక్కదిద్దుకోవటానికి బీజేపీ కృషి చేయాల్సి ఉంది. అధిష్ఠానం మాటవినే సంస్కృతికి భిన్నంగా అప్పటి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఇష్టారాజ్యం సాగించారు. పరిస్థితి క్షీణిస్తోందని ఢిల్లీ పెద్దలు హెచ్చరిస్తున్నా ధోరణి మార్చుకోలేదు. రాజీనామా చేయమని ఆదేశిస్తే శిరసావహించి నట్టు కనబడి, పెద్ద డ్రామా సృష్టించి జనం అడ్డుకున్నారని ఆగిపోయారు. ఎట్టకేలకు నిరుడు ఫిబ్రవరి 9న ఆయనతో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చింది. అప్పటికే ఆయన తప్పు మీద తప్పు చేస్తూ వచ్చారు. ఏకపక్షంగా వ్యవహరించి కుకీల్లో అసంతృప్తి రెచ్చగొట్టారు. వారితో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం నుంచి తప్పుకొని ఆగ్రహావేశాలను పెంచారు. వారిని గంజాయి పండించేవారిగా, మాదకద్రవ్య పంపిణీదార్లుగా, అక్రమ వలసదారులకు ఆశ్రయమిచ్చేవారిగా చిత్రించారు. మణిపుర్‌లో హింస చెలరేగే నాటికే అక్కడ ఇరుపక్షాల్లోనూ ప్రభుత్వంపై అవిశ్వాసం ఏర్పడింది. 2023 మే నుంచి హత్యలు, లూటీలు, గృహదహనాలు, పార్థనా స్థలాలకు నిప్పెట్టడ యథేచ్ఛగా కొనసాగాయి. 260 మంది హత్యకు గురయ్యారని, 1,000 మంది గాయపడ్డారని, 32 మంది అదృశ్యమయ్యారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. 60,000 మందికి పునరావాస శిబిరాలే శాశ్వత చిరునామాలయ్యాయి. అంతా సవ్యంగా ఉన్నందువల్లే ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిందని అనుకోనవసరం లేదు. రాష్ట్రపతి పాలన ఏడాదికి మించి పొడిగిస్తే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ అవసరమవుతుంది. అందుకే ప్రభుత్వ ఏర్పాటు తప్పలేదు. ఇప్పటికీ మెయితీలు, కుకీ-జోలు ఒకరి ప్రాంతంలోకి మరొకరు పోయే పరిస్థితి లేదు. తమ ప్రాంతాలకు స్వయంపాలన హక్కు ఇచ్చేందుకు అంగీకరించి, అందుకు నిర్దిష్ట కాల పరిమితిని లిఖిత పూర్వకంగా ప్రకటిస్తేనే ప్రస్తుతానికి ప్రభుత్వంలో పాలుపంచుకునేందుకు సిద్ధపడతామని కుకీ-జో తెగలు ఇప్పటికే తెలిపాయి. ఆ విషయంలో ఏమీ తేల్చి చెప్పలేదన్న ఆగ్రహంతోనే కొత్త సర్కారులో ఎవరూ భాగస్వామ్యం తీసుకోవద్దని వారు పిలుపునిచ్చారు. ఆ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికే కేంద్రం విడిచిపెట్టదల్చుకున్నదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఆ నిర్ణయం సంగతలా ఉంచి ముందు సంయమనం పాటించటం, అందరినీ కలుపుకొని వెళ్లటం వంటివి అవసరమని ఖేమ్‌చంద్ తెలుసుకోవాలి. ఎన్నికైన ప్రభుత్వం వస్తే కనీసం సమస్యలు చెప్పుకునే వీలుంటుందని జనం అనుకుంటారు. అలాగని ఇప్పుడున్న పరిస్థితుల్లో తక్షణ పరిష్కారాలపై పెద్ద ఆశలేమీ ఉండవు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్న విశ్వాసమైతే కలగాలి. ఆ విశ్వాసాన్ని ఖేమ్‌చంద్ ప్రభుత్వం పొంద గలిగితే కొంతమేర విజయం సాధించినట్టే!





# పాక్‌కు బలూచ్ సవాలు!

బలూచిస్తాన్ స్వాతంత్ర్య కాంక్షను ఉక్కుపాదాల కింద తొక్కివుంచాలని ఏడు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్న పాకిస్తాన్ పాలకులకు యథాప్రకారం మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గత వారం చివరిలో తొమ్మిది జిల్లాల్లో కొనసాగించిన ఆత్మాహుతి దాడుల్లో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 84 మంది పాక్ సైనికుల్ని హతమార్చి, మరో 18 మందిని అపహరించింది. ప్రతీకారంగా తాము జరిపిన దాడుల్లో 133 మంది బీఎల్ఏ మిలిటెంట్లు చనిపోయారని పాక్ సైన్యం ప్రకటించింది. ఒకప్పుడు తూర్పు పాకిస్తాన్ భాషనూ, సంస్కృతినీ విస్మరించిన పర్యవసానంగా అది విడివడి బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసి కూడా దేశంలో 40 శాతం భూభాగం గల బలూచిస్తాన్‌ను పాక్ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటిన్నరమంది జనాభా నివసించే ఆ ప్రాంతానికి ఒకపక్క అఫ్ఘానిస్తాన్, మరోపక్క ఇరాన్, మూడోవైపు అరేబియా సముద్రం ఉండగా వర్షా భావ పరిస్థితుల కారణంగా అత్యధిక భూభాగంలో భూగర్భ జలాలే ఆధారం. అక్కడ పండే యాపిల్స్, ద్రాక్ష, బాదం, ఖర్జూరం వగైరాలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. పాక్ పండ్ల ఎగుమతుల్లో 90 శాతం వాటా బలూచిస్తాన్ ప్రాంతానిదే. నీటి పారుదల సదుపాయం పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో గోధుమ, వరి, బార్లీ, ఆలుగడ్డ పండుతాయి.

ఇంతగా దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నా బలూచిస్తాన్ అభివృద్ధిని పాలకులు పూర్తిగా మరిచిపోయారు. అక్కడి భూపొరల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. రాగి, సీసం, క్రోమైట్, గ్రానైట్, జింకు వగైరాలున్నాయి. చమురు, సహజ వాయువు, బొగ్గు, బంగారం ఉన్నాయి. వీటిల్లో బంగారం, రాగి గనుల నిర్వహణ చైనా చేతుల్లో ఉంది. అది పెట్టుబడి పెట్టి నిర్మించిన గ్వాదర్ నౌకాశ్రయం బలూచిస్తాన్ ప్రాంతం లోనిదే. 6,500 కోట్ల డాలర్లతో చైనా నిర్మించతలపెట్టిన చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనాలోని షిన్‌జియాంగ్ నుంచి గ్వాదర్ వరకూ ఉంటుంది. చైనా దోపిడీ చాలలేదన్నట్టు నిరుడు సెప్టెంబర్‌లో అమెరికా కూడా వచ్చింది. ఆ దేశానికి చెందిన బహుళ జాతి సంస్థ స్ట్రాటజిక్ మెటల్స్‌తో పాక్ సైన్యం అనుబంధ సంస్థ 50 కోట్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఇదంతా ఆ ప్రాంత అభివృద్ధి కోసమేనంటూ ప్రభుత్వం చెబుతున్నదంతా బూటకమనీ, గ్వాదర్ నౌకాశ్రయం తర్వాత తమ మత్స్యకారులు జీవిక కోల్పోయారనీ, గుక్కెడు మంచినీళ్లు దొరకడం కూడా కష్టమవుతున్నదనీ బీఎల్ఏ ఆరోపణ.

పాకిస్తాన్ ఆవిర్భవించాక 1948లో బలూచిస్తాన్‌ను బలవంతంగా విలీనం చేసుకుంది. అప్పటి నుంచి తిరుగుబాట్లు సాగుతూనే ఉన్నాయి. అణిచేద్దామని చూసిన ప్రతి సారీ అవి మరింత తీవ్రంగా పోటెత్తుతున్నాయి. పాక్ సంస్కృతి, సంప్రదాయాలతో తమకేమాత్రం పోలిక ఉండదని, ఒక దేశంగా ఉంటేనే అస్తిత్వ పరిరక్షణ, అభివృద్ధి సాధ్యమని ఆ ప్రాంతవాసుల వాదన. ఇందుకోసం వామపక్ష భావాలతో ప్రభావితుడైన మీర్ గౌస్ బిజెంజో ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిధిలో పోరాటాలు జరిగాయి. పాక్ పరిధిలోనే స్వయంపాలనకు హామీ ఇవ్వాలన్న డిమాండ్‌తో నేషనల్ అవామీ పార్టీ (ఎన్ఏపీ) ఏర్పాటు చేసి, 1970 ఎన్నికల్లో బలూచిస్తాన్, ప్రస్తుత ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ప్రాంతాల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ మరో మూడేళ్లకే అప్పటి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం సైనిక చర్య ద్వారా ఆ రెండు ప్రభుత్వాలనూ కూలదోసింది. ఈ అప్రజాస్వామిక చర్యే అనంతర కాలంలో మిలిటెన్సీకి బీజం వేసింది.

బలూచిస్తాన్‌లో పాక్ సైన్యం చేయని దురాగతం లేదు. బలూచ్ యూనివర్సిటీలోనూ, వెలుపలా యువతను అపహరించటం, హతమార్చటం దానికి అలవాటైన విద్య. 2011 నుంచి ఇంతవరకూ 10,000 మంది మాయమయ్యారంటే ఇదెంతగా ఉందో అంచనా వేయొచ్చు. 2018 తర్వాత బలూచ్ మిలిటెంట్ సంస్థలు ఏకం కావటంతో పోరాటాలు ఉద్ధృతమయ్యాయి. నిరుడు మార్చిలో జాఫర్‌ఖాన్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేయటం మొదలుకొని పాక్ సైన్యంపై సాగిస్తున్న నిరంతర దాడులు పాలకుల్ని ఊపిరాడకుండా చేస్తున్నాయి. చారిత్రక ఆకాంక్షలను అణగదొక్కి, అభివృద్ధిని విస్మరించే ఏ పాలకులకైనా ఇదే దుఃస్థితి ఎదురవుతుంది. తప్పు తెలుసుకోకుండా, గుణపాఠం నేర్చుకోకుండా, మిలిటెంట్లకు భారత్ మద్దతుందని అనవసర యాగీ చేయటం పాక్ పాలకుల నిస్సహాయతకు అద్దం పడుతోంది.



తెలుగు దిన పత్రిక

https://aksharagalam.com

అక్షరగళం

నిజం..నిర్భయంగా

గ్రేటర్ -హైదరాబాద్

# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవి జాతర



**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం పరిధిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం జాతర నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ , మున్సిపల్ శాఖలు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు మద్దతుగా నిలవండి





○ **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 08 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ప్రజా ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకురాలు విజయ రెడ్డి, 15 వార్డుల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీశైలం హైద్రాబాద్ ప్రధాన రహదారిపై భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా పాలనలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఇందిరా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నానని తెలిపారు. వార్డులో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల అభివృద్ధిపై ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వార్డు అభివృద్ధిలో వెనుకబడిందని, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పరిశుద్ధం, మౌలిక వసతుల్లో విప్లవాత్మక మార్పులు తెస్తానని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, అభివృద్ధికి చిహ్నమైన చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, రవికాంత్ గౌడ్, క్యామా రాజేష్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, ఖాదర్ ఖాద్రి, అంజన్ రెడ్డి, మెకానిక్ బాబా, ఎంగలి ప్రసాద్, యూత్ వస్పుల శ్రీకాంత్, ఎండి ఫరీద్, శ్రీధర్ నాయక్, ఇమ్రాన్ బాబా, షాబుద్దీన్, దుడ్డు కృష్ణ యాదవ్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

○ **తొమ్మిదో వార్డు అభ్యర్థి గుర్రం కేశవులు**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 08 (అక్షర గళం):** పట్టణ అభివృద్ధి ఒక్క కాంగ్రెస్తోనే సాధ్యమని తొమ్మిదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం కేశవులు అన్నారు. ఆదివారం తొమ్మిదో వార్డులోని శ్రీకాంత్ కాలనీ, వెంకటగిరి, పోస్ట్ ఆఫీస్ కాలనీ, విద్యానగర్ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వార్డుల్లో అనేక సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తొమ్మిదో వార్డు నుంచి పోటీ చేస్తున్నందున తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తను నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట అబ్దుల్ ఖాదర్, రహీం, అబ్దుల్ కరీం, సురేష్ నాయక్, యోగి, రమేష్, సలీం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తా

○ **తొమ్మిదో వార్డు అభ్యర్థి మహేష్**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 08 (అక్షర గళం):** బీజేపీ గెలుపుతోనే 9వ వార్డు అభివృద్ధి సాధ్యమని, కేంద్ర ప్రభుత్వం నిధులతో మున్సిపల్ అభివృద్ధి చెందుతుందని 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి ఎర్రవోలు మహేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వార్డు పరిధిలోని శ్రీకాంత్ కాలనీ, వెంకటగిరి, పోస్ట్ ఆఫీస్, విద్య నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో మురికినీరు పూర్తిగా రోడ్లపై పారుతుందన్నారు. ఇండ్ల ముందు మురికినీరు నిలుస్తుండడంతో దుర్గం వెదజల్లుతుందన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డు 'ప్రజలను పట్టి పీడిస్తున్న దుర్గంధం సమస్య నుంచి ప్రజలకు శాశ్వత విముక్తి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో ధోనాదుల మహేష్, ఉప సర్పంచ్ వరికుప్పల శ్రీను, జజ్జేల ఆనంద్, శ్రీను, పురుగుల శివ, దాస్యం వంశీ, చింటూ, సాయి, సతీష్, శ్రీకాంత్, రమేష్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.



# అభివృద్ధికి మాట ఇస్తున్నా.. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

○ **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 08 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 5వ వార్డు అభివృద్ధి భాద్యతను నేను తీసుకుంటాను.. మీరు కాంగ్రెస్ అభ్యర్థి ఒగ్గు మహేష్ను చేతి గుర్తుపై ఓటేసి గెలిపించాలని 5వ వార్డు ప్రజలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని 5వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఒగ్గు మహేష్ కు చేతి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమం అంటే గుర్తుకు వచ్చేది కాంగ్రెస్ పార్టీ, అభివృద్ధి అంటే గుర్తొచ్చేది కాంగ్రెస్ పార్టీ. కులమతాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించేది కాంగ్రెస్ పార్టీయే అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు పట్టం కడితే అభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకురాలు విజయ రెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, వార్డు ఇంచార్జీ డోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లు అనంత రెడ్డి, నిట్ట నారాయణ, పులికంటి మైసయ్య, వస్పుల మల్లేష్, జంతుక అశోక్, విజయ్ నాయక్, మెకానిక్ బాబా, రఘు రాములు, రాజేందర్, జంతుక శంకర్, యాదయ్య, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.






# దివ్యాంగులైన ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలి

○ **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** ఈ నెల 11న మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగించుకునే దివ్యాంగులైన ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఈ నెల 11న ఎన్నికలలో దివ్యాంగులైన ఓటర్లకు కనీస అవసరమైన సౌకర్యాలు కల్పించి పోలింగ్ ప్రక్రియలో వారు చురుకుగా పాల్గొనేందుకు ప్రోత్సహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న దివ్యాంగుల ఓటర్ల సంఖ్యను బట్టి, ర్యాంపులు, వీల్చైర్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. దివ్యాంగులైన ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. వికలాంగులకు ప్రాధాన్య ప్రవేశ పాసులు జారీ చేయాలని, దివ్యాంగులు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు.



## అబద్ధపు ప్రచారాలు నమ్మొద్దు

○ **రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 08 (అక్షర గళం):** అబద్ధపు ప్రచారాలతో, అమలు చేయలేని ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో నమ్మి మరోసారి మోసపోవద్దని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాపిశెట్టి రాము, 11వ వార్డు అభ్యర్థి ఆచాలి భీంజీ, 9వ వార్డు అభ్యర్థి సయ్యద్ ఖలీల్, 14వ వార్డు అభ్యర్థి వస్పుల సాయిలు తరపున ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం గోలీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను గుర్తుంచుకుని మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాబోయే రెండున్నేర కాలంలో తిరిగి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, మాజీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్, జహంగీర్, వడ్డేమోని శివకుమార్, గుమ్మకొండ రాజు, సైదులు గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, శృతిలయ కల్చర్ అకాడమీ ఛైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, లండం యాదయ్య, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, పూసల భాస్కర్, ధార యాదయ్య, గుత్తి శేఖర్, కార్తీక్, శ్రీరాములు, రాఘవేందర్, చింటూ, భరత్, శివ, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.



## ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్

**వెల్దండ ఫిబ్రవరి 08 (అక్షర గళం):** ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందని సర్పంచ్ సత్తూరి ప్రసాద్ అన్నారు వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఉప్పు మదన్ మోహన్ రావు కు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ , 48 వేల రూపాయలు మంజూరైన చెక్కును స్థానిక నాయకులతో బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కోసం అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి ఈ నిధి భరోసాగా నిలుస్తుందన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చల్లా వెంకట్ రెడ్డి ఉప సర్పంచ్ రామకృష్ణ వార్డు నెంబర్ సభ్యులు లస్కర్ అఖిల వెంకటేష్ వెల్దండ వాసవి క్లబ్ అధ్యక్షులు అల్లంపల్లి కృష్ణ సీనియర్ నాయకులు కాసోజ్ బ్రహ్మాచారి సిలికేశ్వరం యాదయ్య వెంకటేష్ ఉప్పు వెంకట్ రావు ముంత అంజయ్య పకాడి పరమేష్ పకాడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- 12వ వార్డు శ్రీమతి మిర్యాల ప్రభావతిని భారీ మెజారిటీతో ఆశీర్వదించండి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 8 (అక్షర గళం):**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అభివృద్ధికి పట్టం కట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు ఆదివారం కల్వకుర్తి 12వ వార్డునలో 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మిర్యాల ప్రభావతి శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు వార్డులో అభివృద్ధి పనులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూసుకుంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఠాగూర్ బాలాజీ సింగ్ సంజీవ్ యాదవ్ విజయ్ కుమార్ రెడ్డి శేఖర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.





## ఇంటింటా ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పసుల

**కల్వకుర్తి ఫిబ్రవరి 8(అక్షర గళం):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓట్లు వేసి గెలిపించాలని 16వ వార్డు కౌన్సిలర్ పశుల లలిత ఆదివారం ఇంటింటా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేశారు 16వ వార్డులో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎల్లవేళలా అందుబాటులో ఉండి 16వ వార్డు రూపురేఖలను మారుస్తానని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారం కోసం ప్రాధాన్యతను ఇస్తానని అన్నారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదెల రామకృష్ణ బాలా గౌడ్ తదితరులు ఉన్నారు.





## కల్వకుర్తి మున్సిపాలిటీని అభివృద్ధి పరుస్తా

- 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ ను గెలిపించండి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 8 (అక్షర గళం):**

కల్వకుర్తి మున్సిపాలిటీ ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70 కోట్లతో అభివృద్ధి పరిచామని అండర్ డ్రైనేజ్ సీసీ కాలువలు పూర్తి చేశామని అసంపూర్తిగా ఉన్న పనులన్నీ ఎన్నికల అనంతరం త్వరత గతిన చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు ఆదివారం 22వ వార్డులో విస్తృతంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు వార్డు కౌన్సిలర్ గా కొల్లోజు రాజేష్‌ను గెలిపించాలని అభివృద్ధి మరింత చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న పథకాలను వివరించాడు ఈ కార్యక్రమంలో చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ వార్డు ఇంచార్జ్ సురభి వెంకటేశ్వరరావు నంబి శంకర్ రేష్మా బేగం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 8 (అక్షర గళం):**

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన వడ్డే బాలమ్మ వారం రోజుల క్రితం చెరువులో పడి మృతి చెందింది ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న లింగరావుపల్లి సర్పంచ్ శతాబ్ది టౌన్షిప్ ఎండి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆదివారం తన ప్రగాఢ స్థానుభూతిని మృతురాలి కుటుంబానికి తెలియజేస్తూ కుటుంబానికి భరోసాగా తక్షణ ఆర్థిక సహాయం ద్వారా స్థానిక నాయకులకు ₹4,000 ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్కేడి అంబాజీ కాంగ్రెస్ నాయకులు వడ్డే రాజు పులిజాల విష్ణు మల్ల అజయ్ వడ్డే రాము భీమయ్య కృష్ణయ్య శ్రీకాంత్ రవి తదితరులు పాల్గొన్నారు.





## చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ అందజేత

**వెల్దండ ఫిబ్రవరి 08 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని పోతే పల్లి గ్రామానికి చెందిన తాంధ్ర లక్ష్మయ్య నా ఆరోగ్యంతో బాధపడుతూ ఎస్వీఎస్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య ను పరామర్శించి లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకోవాలని మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు కోరారు అనంతరం లక్ష్మయ్యకు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు కార్యక్రమంలో సత్యనారాయణ అంజయ్య ఒగ్గు కృష్ణ పత్తి వెంకటయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ అందజేత

**వెల్దండ ఫిబ్రవరి 08 (అక్షర గళం):**

వెల్దండ మండల పరిధిలోని పోతే పల్లి గ్రామానికి చెందిన తాంధ్ర లక్ష్మయ్య నా ఆరోగ్యంతో బాధపడుతూ ఎస్వీఎస్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి తగుళ్ల కొండల్ యాదవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య ను పరామర్శించి లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకోవాలని మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు కోరారు అనంతరం లక్ష్మయ్యకు పోతే పల్లి సర్పంచ్ కొండల్ యాదవ్ 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు కార్యక్రమంలో పోతే పల్లి గ్రామ వార్డు సభ్యులు మార్కండేయుడు ఎగిరి శెట్టి శివ అంజి యాదవ్ శివ తదితరులు పాల్గొన్నారు.



## పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్న ఉద్యోగస్తులు

- కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్

**కల్వకుర్తి ఫిబ్రవరి 8 (అక్షర గళం):**

కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ను 28 మంది ఉద్యోగస్తులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని ఆదివారం తమ ఓటును వేశారని తెలిపారు ప్రశాంత వాతావరణం లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహించామని తెలిపారు.





## నన్ను నేను అంగీకరించడానికే ఎంతో సమయం

చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొంతకాలం వరకూ కూడా తనలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉండేదని, ఆ తర్వాతే అది పెరిగిందని చెబుతోంది మృణాల్ ఠాకూర్. ఆమె, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటించిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. రవి ఉద్యవార్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మృణాల్ మాట్లాడుతూ.. ''చిన్నప్పటి నుంచే నాకు కొంచెం ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండేది. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా అంటే.. ఇటీవలే విడుదలైన నా సినిమా 'సన్ ఆఫ్ సర్దార్ 2' వరకు కూడా నేను అలానే భావించేదాన్ని. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. నన్ను నేను అంగీకరించడానికి, అందంగా ఉన్నానని తెలుసుకోవడానికి నాకు ఇంత సమయం పట్టిందా అనిపిస్తుంద''ని అంది.

## 2027 సంక్రాంతికి అక్కినేని హీరో మూవీ..

సినిమాల పరంగా సంక్రాంతి సీజన్‌కు ఎంతటి క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ పండగను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేకంగా సినిమాలు చేసేవారూ ఉన్నారు. 2027 సంక్రాంతికి తమ నిర్మాణ సంస్థ నుంచి ఓ సినిమా రానుందని 'అన్నపూర్ణ స్టూడియోస్' తాజాగా ప్రకటించడంతో.. అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. హీరో, సినిమా పేరు తదితర వివరాలేవీ వెల్లడించకుండా.. మూవీ రిలీజ్ డేట్ మార్క్ చేసుకోండంటూ అప్పుడే ప్రమోషన్‌ను ప్రారంభించింది. ''వాసివాడి తస్సాదియ్యా.. 2027 సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్‌ఫుల్ ఉంటుంది కదా'' అంటూ సినిమా జనవరి 15న విడుదల కానుందని ప్రకటించింది. 'సోగ్గాడే చిన్ని నాయనా', 'బంగార్రాజు' తర్వాత నాగార్జున హీరోగా దర్శకుడు కల్యాణ్ కృష్ణ మరో సినిమా తెరకెక్కించే అవకాశాలున్నాయంటూ ప్రచారం జరుగుతోంది. నిర్మాణ సంస్థ అప్‌డేట్‌తో దానికి బలం చేకూరినట్లైంది. వాసివాడి తస్సాదియ్యా.. 'బంగార్రాజు'లోని ఫేమస్ డైలాగ్. పైగా సోగ్గాడు కాకుండా 'సంక్రాంతికి సోగ్గాళ్లు' అని పేర్కొన్నారు. 'బంగార్రాజు'లో నాగార్జున, నాగచైతన్య కలిసి నటించిన సంగతి తెలిసిందే. మళ్లీ ఈ ఇద్దరితోనే దానికి కొనసాగింపుగా కల్యాణ్ కృష్ణ మరో సినిమా చేస్తున్నారా? వేరే కథను తెరకెక్కిస్తున్నారా? నాగార్జున కల్యాణ్ కాంబినేషన్‌ను దృష్టిలో పెట్టుకుని 'సంక్రాంతి సోగ్గాళ్లు' అన్నారా? తెలియాలంటే వేచి చూడాల్సిందే.





## ప్రతిఒక్కర్నీ నవ్వించే పంపిస్తాం

''ఫంకీ' చిత్రంతో కడుపుబ్బా నవ్విస్తాం. మాట మీద నిల్చుంటాం'' అంటున్నారు కథానాయకుడు విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ సినిమాని అనుదీప్ కేవీ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. ''బాధ్యతగా ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలన్న ఉద్దేశంతో కాస్త గ్యాప్ తీసుకున్నా. ఈ చిత్రం కచ్చితంగా రెండు గంటల పది నిమిషాల పాటు నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది. ఈ నెల 13న కుటుంబ సమేతంగా థియేటర్లకు రండి'' అన్నారు. ''ఇందులో అనుదీప్ ట్రేడ్ మార్క్ కామెడీని చూడబోతున్నారు. ట్రైలర్‌లో చూసిన దానికంటే రెట్టింపు వినోదం సినిమాలో కనిపిస్తుంది'' అంది నటి కయాదు లోహర్. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. ''ఈ చిత్రంలో బలమైన కథ, ఎమోషన్స్ ఊహించి థియేటర్‌కు రాకండి. ట్రైలర్‌లో చూపించినట్లుగా మంచి పంచ్‌లు, వినోదం కోసమే రండి. కచ్చితంగా ప్రతిఒక్కర్నీ నవ్వించే పంపిస్తాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో అనుదీప్, మోహన్, వెంకట్, నిరంజన్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరాజ్ అంకితభావానికి హ్యాట్సాఫ్!

హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో క్రికెట్ సాధన చేస్తున్నాడు మహ్మద్ సిరాజ్. అప్పుడే అతడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అది చేసింది టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్. ప్రపంచకప్ ఆడాల్సిన హర్షిత్ రాణా గాయపడ్డాడని, తన స్థానంలో జట్టులోకి రావాలన్నది కాల్ సారాంశం. కొన్ని గంటల్లోనే ముంబయి విమానం ఎక్కేశాడు సిరాజ్. కట్ చేస్తే తర్వాతి రోజు రాత్రి టీ20 ప్రపంచకప్‌లో భాగంగా యూఎస్‌ఏతో భారత్ ఆడిన తొలి మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగడమే కాదు.. 3 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మహ్మద్ సిరాజ్ టీ20 ప్రపంచకప్‌లో ఆడడం అన్నది ఎవ్వరూ ఊహించని విషయం. ఏడాదిన్నరకు పైగా టీ20 జట్టులోనే లేడు. చాలా కాలంగా జట్టు ఎంపికకు అతడిని పరిగణనలోకే తీసుకోవట్లేదు సెలక్టర్లు. టీమ్ ఇండియా తరఫున 45 టెస్టులు, 50 వన్డేలు ఆడి ప్రధాన బౌలర్లలో ఒకడిగా ఎదిగిన సిరాజ్‌కు టీ20ల్లో మాత్రం పేలవ రికార్డు ఉంది. ప్రపంచకప్‌నకు ముందు అతను 16 టీ20లు ఆడి 32.28 సగటుతో 14 వికెట్లు మాత్రమే తీశాడు. టీ 20ల్లో పెద్దగా వికెట్లు తీయకపోగా.. ధారాళంగా పరుగులిచ్చేస్తాడన్న ముద్ర పడిపోయింది అతడిపై. దీంతో అతడిని 2024 జులైలో శ్రీలంక పర్యటన తర్వాత టీ20 జట్టులోకే ఎంపిక చేయలేదు సెలక్టర్లు. బుమ్రా, అర్షదీప్ కాకుండా హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలకే ప్రాధాన్యం దక్కుతోంది. కానీ ప్రసిద్ధ్ చివరగా ఆడిన సిరీస్‌ల్లో పేలవ ప్రదర్శన చేయడంతో అతడిని పక్కన పెట్టేశారు.



**అనుకోకుండా తుది జట్టులోకి..**

అయితే హర్షిత్ రాణా టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు గాయపడడంతో అనూహ్యంగా సిరాజ్‌కు అవకాశం దక్కింది. కానీ.. ప్రత్యామ్నాయ బౌలర్‌గా ఎంచుకున్న సిరాజ్‌కు తుది జట్టులో చోటు కష్టమనే అనుకున్నారంతా. కానీ ప్రధాన పేసర్ బుమ్రా జ్వరం కారణంగా తొలి మ్యాచ్‌లో అందుబాటులో లేకుండా పోవడంతో అనుకోకుండా సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూ 3 కీలక వికెట్లతో విజృంభించాడు సిరాజ్. 162 పరుగుల లక్ష్యం అంటే టీ20ల్లో పెద్ద కష్టమేమీ కాదు. అమెరికా టాప్ ఆర్డర్ నిలబడితే ఛేదన సాధ్యమయ్యేదే. కానీ సిరాజ్ తన తొలి ఓవర్లోనే ప్రమాదకర ఆండ్రీస్ గాస్‌ను పెవిలియన్కు చేర్చాడు. తర్వాత తెలుగు కుర్రాడు సాయితేజను ఔట్ చేశాడు. మిడిలార్డర్లో ధాటిగా ఆడుతున్న శుభమ్ రంజానేకు కూడా చెక్ పెట్టి యుఎస్‌ఏ ఓటమిలో కీలకపాత్ర పోషించాడు. ఏడాదిన్నరగా టీ20 జట్టు ఛాయల్లోనే కనిపించని ఆటగాడు.. ఇప్పుడిలా టీ20 ప్రపంచకప్ ఆడడం, సత్తా చాటడం అనూహ్యం అనే చెప్పాలి.

**గాయపడటం అరుదు!**

మహ్మద్ సిరాజ్ అంటే అంకితభావానికి కేరాఫ్ అడ్రస్ అని చెప్పొచ్చు. ఈ రోజుల్లో ఫాస్ట్ బౌలర్లు ఎంత సున్నితంగా తయారయ్యారో, ఫిట్‌నెస్ సమస్యలతో ఎలా సతమతం అవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. అందుకే చాలా సెలక్టివ్‌గా మ్యాచ్‌లు ఆడుతున్నారు. కానీ సిరాజ్ అలా కాదు. అతను గాయపడడం, విశ్రాంతి తీసుకోవడం అరుదు. టీ20 ప్రపంచకప్‌లో అడుగు పెట్టడానికి ముందు అతడు హైదరాబాద్ తరఫున రెండు రంజీ మ్యాచ్‌లు ఆడాడు. ఆ జట్టు క్వార్టర్స్‌కు అర్హత సాధించి ఉంటే శుక్రవారం కూడా మ్యాచ్ ఆడుతూ ఉండేవాడు. రంజీ ట్రోఫీ కంటే ముందు దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో, అంతకుముందు టీ20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరిలోకి దిగాడు. టెస్టులు, వన్డేల్లో టీమ్‌ఇండియా కీలక బౌలర్‌గా ఉంటూ ఇలా మూడు ఫార్మాట్లలో దేశవాళీ క్రికెట్ ఆడుతున్నది ఒక్క సిరాజ్ మాత్రమే. రంజీ మ్యాచ్ అవ్వగానే విశ్రాంతి తీసుకోకుండా హైదరాబాద్‌లో సాధన చేస్తూ ఉన్నాడు సిరాజ్. అదీ అతడి నిబద్ధత.

## శ్రీలంక కెప్టెన్ ప్రపంచ రికార్డు



శ్రీలంక టీ20 జట్టు కెప్టెన్ దసున్ షనక ఓ చెత్త రికార్డు విషయంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ప్రపంచకప్‌లో ఇవాళ (ఫిబ్రవరి 8) ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌటైన అతను.. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక డకౌట్లైన (113 ఇన్నింగ్స్‌ల్లో 16 సార్లు) ఆటగాడిగా అవతరించాడు. షనకకు ముందు ఈ రికార్డు జప్పి బిమెన్యిమనా (62 ఇన్నింగ్స్‌ల్లో 15) పేరిట ఉండేది. షనక, జప్పి తర్వాతి స్థానాల్లో పాల్ స్టిర్లింగ్ (158 మ్యాచ్‌ల్లో 14) ఉన్నాడు. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ ఆదిలో శ్రీలంక ఆటగాళ్లను బాగానే కట్టడి చేసింది. తొలి 10 ఓవర్లలో ఆ జట్టు 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేయగలిగింది. 16 ఓవర్ల వరకు కూడా పరిస్థితి ఇలాగే కొనసాగింది. ఆ సమయానికి 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే ఆ ఓవర్ తర్వాత ఐర్లాండ్ బౌలర్లు లయ తప్పారు. అనవసర వైడ్లు, ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఫలితంగా చివరి 4 ఓవర్లలో లంక ఆటగాళ్లు 59 పరుగులు పిండుకున్నారు. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఐరిష్ బౌలర్లలో జార్జియా డాక్రెల్ (4 0172) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మార్క్ అడైర్ (40331), గెరాత్ డెలానీ (40241) కూడా పర్వాలేదనిపించారు. మాథ్యూ హంఫ్రేస్ (40 440), బ్యారీ మెక్ కార్తీ (30402) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. లంక ఇన్నింగ్స్‌లో కుసాల్ మెండిస్ (56 నాటౌట్) టాప్ స్కోరర్ కాగా.. ఆఖర్లో కుసాల్ మెండిస్ (44) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మిగతా ఆటగాళ్లలో నిస్సంక 24, కమిల్ మిషారా 14, పవన్ రత్నాయకే 5, వెల్లాలగే 10, హసరంగ ఒక్క పరుగు చేయగా.. షనక డకౌటయ్యాడు.

# గంభీర్-కోహ్లీ మధ్య విభేదాలు..!

ప్రస్తుత భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీల సఖ్యతపై ఎప్పటి నుంచో పెద్ద చర్చే సాగుతోంది. ఐపీఎల్‌లో చోటు చేసుకున్న ఘర్షణల అనంతరం వీరిద్దరి మధ్య విభేదాలున్నాయని గట్టిగానే ప్రచారం జరిగింది. గంభీర్ టీమ్‌ఇండియా హెడ్ కోచ్‌గా మారిన తర్వాత మొదట్లో సవ్యంగానే ఉందనిపించినా.. ఇద్దరు కలిసి మాట్లాడుకోకపోవడం, ఒకరినొకరు పట్టించుకోకపోవడం వంటివి జరిగాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. అయితే, ఈ అంశంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తొలిసారిగా స్పందించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. గంభీర్, కోహ్లీ మధ్య ఎలాంటి గొడవలు లేవని, వారు గొడవ పడటం తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. వారిద్దరి మధ్య మంచి స్నేహపూర్వక బంధం ఉందన్నారు. కోహ్లీని గంభీర్ వన్డే జట్టు నుంచి తప్పించాలని చూస్తున్నాడన్న ప్రచారాన్ని సైకియా ఖండించారు. అలాంటి అభిప్రాయం కొందరిలో ఉండొచ్చన్నారు. అయితే, కోహ్లీ ఎప్పుడూ జట్టులోనే ఉన్నాడని, గంభీర్ కూడా జట్టుతోనే ఉన్నాడని తెలిపారు. ఫలితాలను అందరం చూస్తూనే ఉన్నామన్నారు. ఆ ప్రచారంలో నిజం లేదని వెల్లడించారు.

**కోహ్లీ టెస్టు క్రికెట్ రిటైర్‌మెంట్‌లో బలవంతం లేదు**

కోహ్లీని టెస్టు క్రికెట్ నుంచి బలవంతంగా రిటైర్ చేయించారనే ఊహాగానాలు అప్పట్లో వచ్చాయి. వాటిపై సైకియా స్పందిస్తూ.. కోహ్లీ స్థాయి ఆటగాడిని ఎవరూ బలవంత పెట్టలేరని చెప్పారు. అతనొక లెజెండ్ అని, తన నిర్ణయాలు తానే తీసుకుంటాడని చెప్పారు. ఆటగాళ్ల కెరీర్‌లో బీసీసీఐ జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు.

**రోహిత్-కోహ్లీ భవిష్యత్తు?**

రోహిత్ శర్మ, కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత.. వన్డేల్లోనూ వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని కథనాలు వెలువడ్డాయి. ఆస్ట్రేలియాతో సిరీస్ తర్వాత ఇద్దరూ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పొచ్చని రాసుకొచ్చారు. దీనిపై సైకియా స్పందిస్తూ ''కొంతమంది అర్థం లేని విషయాలు కూడా రాస్తుంటారు. అలాంటి వదంతులపై స్పందించం. ఈ అంశాలు ఎప్పుడూ అధికారిక సమావేశాల్లో ప్రస్తావనకే రాలేదు''అని తెలిపారు.





## అఫ్గానిస్థాన్‌పై నెగ్గిన న్యూజిలాండ్

చెన్నై: టీ20 ప్రపంచకప్‌లో అఫ్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆ జట్టులో టిమ్ సీఫెర్ట్ (65) అర్ధశతకం చేయగా, గ్లెన్ ఫిలిప్స్ (42), మార్క్ చాప్‌మన్ (28), డారిల్ మిచెల్ (25*) రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్ రెహమాన్ 2, ఒమర్జాయ్, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ నబీ(63) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. సెదిఖుల్లా అటల్(29), రెహ్మానుల్లా గుర్బాజ్(27), దార్విష్ రసూలీ (20) ఫర్వాలేదనిపించారు. మూడో వికెట్‌కు అటల్, గుల్బదీన్ కలిసి 79 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో ఒమర్జాయ్(14) రనౌటయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఫెర్గుసన్ 2 వికెట్లు తీయగా.. హెన్రీ, డఫి, రవీంద్ర తలో వికెట్ పడగొట్టారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154